# మల్లారెడ్డి

"నా దృష్టిలో నేటి తెలుగు సాహిత్యం ప్రతిష్టంభనలో వుంది. చౌరస్తాలో వుంది. ప్రాచీన సాహిత్యం మ్యూజియానికిచెందింది. ముందుకు రాకెట్ వేగంతో వెళ్ళాలి" అన్నారు విఖ్యాత తెలుగుకవి శ్రీ గజ్జెల మల్లారెడ్డి 1971 జులై 14 న ఢిల్లీలో ఒక సభలో మాట్లాడుతూ —

"అభ్యుదయ సాహిత్యము బద్దలయింది. "ఎలుక చచ్చింది" అని ఒకగేయం 'నవత' లో వచ్చింది. ఏమిటి దీనిఅర్థం అని అడిగితే వాల్మీకి-క్రౌంచపక్షి ఉదంతాన్ని ఉదాహరించారు. మార్మిక ధోరణులు, ఎక్సిస్టెన్షియలిజములు తలెత్తాయి. ధ్వనిద్వారా చెప్పేది 'సింబాలిజం' శ్రీ శ్రీ తెనాలి రామకృష్ణుడిని "ధ్వని కవితా సార్వభౌముడు" అన్నాడు. "చితి చింత" అన్న కావ్యంలో కవి ఎందుకు బాధపడుతున్నాడో అర్థంకాదు. కవిత మేధావ్యాపారంకాదు. హృదయ వ్యాపారం. శోకమే గీతమయి కన్నీరు కారాలి. తిక్కనకుంది ఈశక్తి. మాత్రాఛందస్సులో దీనిని శ్రీశ్రీ సాధించాడు. కవిత్వాన్ని సర్కస్ సానిగా చేసే తిరోగమన వాదులుంటూనే వుంటారు.

"తిరోగమనవాదులు, మార్మిక వాదులు, అభ్యుదయ వాదులు స్తంభించి పోయారు కాని, జీవితం నిలవదు. తిరుగుబాటు విప్లవంకాదు. Rebel, Revolutionary కాదు. అన్నిటికీ అడ్డంపడేవాడు విప్లవవాదికాదు. రాగద్వేషాల కతీతంగా పరిశీలించాలి. కళల్లో 'పిచ్చి' పనికిరాదు. ఒక వంక పాత్రలో లీనమయి నటిస్తూనే ఇంకొకవంక తానెవరో గుర్తుంచుకోవాలి. కుందుర్తి. తిలక్ హృదయాన్ని కదిలించే వచనకవిత రాశారు. కాని నేడు

కర్త. కర్మలు మార్చి వచనకవిత్వం అంటున్నారు. ప్రబంధ, భావకవిత్వాల పట్ల తిరుగుబాట్లు జరిగాయి. ఇంకొక తిరుగుబాటు దిగంబర కవిత్వం, ఇది సకల సంప్రదాయ విధ్వంసకం. చారిత్రక దృష్టిలేనిది. ఇది గ్రుడ్డితనం. శూన్యంనుండి ఏదీరాదు. పాతనుండి కొంత తీసుకుని కొత్తలో కలపాలి. మనం చెప్పదలుచుకున్న దానిపట్ల నమ్మకం వుంటే ఎదుటివాడిని తిట్ట నక్కర లేదు.

"మన నరనరాల్లో నన్నయ, తిక్కన, తెనాలి రామకృష్ణుడు వున్నారు. వెయ్యి జన్మలెత్తినా ఒక్క భట్టుమూర్తి పుట్టడు. తెలుగు కవితకతడు పరాకాష్ఠ. అతనికింత పనిపిల్ల తెలుగు సరస్వతి ? 'డుముపులు' చేర్చితే ఏ భాష నయినా ఇముడ్చుకోగలిగిన పరిపుష్ట మయిన భాష మన తెలుగుభాష. రాసినదానిని రాసినట్లుగా సరిగా ఉచ్చరించగలభాష. అందులో అభ్యుదయం వుందా అని అడగవద్దు. తెలుగు నుడికారం ఎంత తీయనిది ! హాల్డేన్ మెచ్చిన భాషఇది. తెలుగు "వాడి" "వేడి" కూడా తగ్గాయి. వాల్మీకికి నన్నయ్యకు వారసుడిని నేను. ఏ కమ్యూనిస్టయినా, సోషలిస్టయినా పెద్దలు సంపాదించిన ఆస్తిని వదలుకోడు "ఫలానామార్కు బీడీలనే వాడుడు" అన్నట్లుగా వుంటుంది.' "ఫలానా పార్టీనే నమ్మడు" అంటే .... ఇప్పుడు కావలసింది సైంటిఫిక్ తిరుగుబాటు. కుళాయిదగ్గర ఆడవాళ్ళల్లా. నిగ్రహం పోయి. "తొలువొలిచేస్తా. తొడలు విరగ్గొడతా" అంటే అది కవిత్వంకాదు. losing temper అన్నారు శ్రీ మల్లారెడ్డి.

సాహిత్యంలో ఇది సంధియుగం — అని శక్తివంతంగా సోదాహరణంగా చెప్పినాక మల్లారెడ్డి అద్భుతమయిన తమ కవితాఖండికలయిదారింటిని చదివి వినిపించారు.

ఢిల్లీ సాహితీప్రియులకు ఈ విందుభోజనం పెట్టినవారు ఢిల్లీ ఆంధ్ర సంఘం. (20 ఆగస్టు 71)